





"మిస్టర్ రావ్!"

"వస్తున్నా సార్!"

టేబులుకు దగ్గరగా నిల్చుకున్నాడు రామారావు.

" 'కర్వు'లన్నీ తయారయినట్లేనా?"

తలూపాడు రామారావు. ఫైల్లోంచి నాలుగు గ్రాఫు కాగితాలు తీసి బల్లమీద పేర్చాడు.

"ఇది 25 డిగ్రీలవద్ద, ఇది ముప్పయి అయిదు, ఇది 60 డిగ్రీలు. ఇది నూట ఇరవయి......" వివరించాడు రావు.

"'ఇ' కమక్కున్నావా?"

"24.5 కాలొరీలు వచ్చింది. కాని మరోసారి చేద్దామని వుంది......"

"ఉ......మరి డేటా ఎక్కడ?"

మరో నాలుగు కాగితాలుంచాడు టేబిల్ మీద రావు.

"ఇది అబ్‌స్ట్రాక్ట్ ఫారమ్‌గా తయారు చేశానండి. ఇది హిస్టారికల్ బ్యాక్‌గ్రౌండు. ఇది అపరేటస్, పద్ధతీ, ఇది మన కొచ్చిన ఫలితాలన్నీ సంగ్రహించి వ్రాసింది."

"ఉ......."

రావుకు అదే చాలు. ప్రొఫెసర్ మూర్తి పరిభాషలో "ఉ" అంటే 'ఎక్సలెంట్' అన్నమాట.

"మరి సల్ఫర్ థర్టీఫైవ్ సంగతి చూచావా? ఏమన్నా ఇంకా వుందా? అయిపోయిందా?"

"మరో రెండు పర్యాయాలకు పనికివస్తుందండి......"

"అవి రెండూ సిద్ధంగా వున్నాయా, క్రోమటోగ్రఫీ షీట్సు ఏవీ......"

"కౌంటర్‌దగ్గరున్నాయండీ......"

ప్రొఫెసర్ మూర్తి లేచాడు. ఇద్దరూ గైగర్ మ్యూల్లర్ కౌంటర్ యంత్రం దగ్గరకు చేరారు.

"వర్కింగ్ వోల్టేజ్ ఎంత?"

"ఎనిమిదివంద లుందండి......"

"బాగా సపరేషన్‌వుందా, రెంటికీ?"

ప్రొఫెసర్ మూర్తి ప్రశ్నకు జవాబుగా రావు రెండు గ్రాఫ్ పేపర్లు చూపాడు.

"ఇది జిర్కోనియం, ఇది యిట్రియం..... ఆర్.ఎఫ్.వాల్యూలు. పాయింట్ తొమ్మిది, పాయింట్ నాలుగు ఆరు, పాయింట్ సున్నా అయిదు"

"పీక్ వాల్యూ చూపించేసారి......"

రావు శ్రావణంతో అక్కడున్న కాగితపు ముక్కల్లో ఒక దాన్ని కౌంటర్ విండోలో వుంచాడు. సీసపు ద్వారం మూసేసి, వోల్టేజి సరిగ్గా వుందని నిర్ణయించుకుని, ఒకేసారి కౌంటర్ కౌంటింగ్ స్విచ్‌నీ, స్టాప్‌వాచీనీ నొక్కాడు.


ఒకదాంతో ఒకటి పందా వేసుకుని కౌంటరులో బల్బులూ, సెకండ్స ముల్లూ పరుగెత్తసాగాయి.

ప్రొఫెసర్ మూర్తి అవన్నీ గమనించడంలేదు. రావు వెనకాల నిల్చుని రావు జుత్తువంకా, అతని ముఖంవైపూ చూచాడు.

వెలిగి ఆరిపోతున్న కౌంటింగ్ బల్బుల్లో రావు ముఖంలో క్రీనీడలు లీలగా కన్పించాయి మూర్తికి. రాత్రి పదిగంటలదాకా తనతో కూర్చుని, కౌంటర్ వద్దా, క్రోమటోగ్రాఫిక్ కాలమ్‌వద్దా ఇలా తనకు సహాయం చేయటం రావుకి కొత్తకాదు. తన దగ్గర పని చేసిన విద్యార్థులంతా ఒక ఎత్తు—రావు ఒక ఎత్తు. వాళ్ళందరూ డిగ్రీలకోసం చదివారు. తనకు మస్కా వేసేవాళ్ళు. పండగలప్పుడూ, తన పుట్టినరోజు (ఎలా కనుక్కునేవాళ్ళో) అప్పుడూ వారి దగ్గర్నుంచి గ్రీటింగ్స్ కురిసేవి.

రావు తనకు తెలిసి ఎన్నడూ ఎవరితోనూ పెద్దగా మాట్లాడడం కూడా చూడలేదు తను. ఒకసారి తను కారుమీద నెమ్మదిగా ఆలోచించుకుంటూ పోతున్నప్పుడుకూడ చూచా డతన్ని. పేవ్‌మెంట్ ప్రక్కగా తల వంచుకుని అడుగులువేస్తూ పోయేవాడు రావు.

ప్రొఫెసర్ మూర్తి ఆలోచనలు అంతరాయం



ఖిల్లిన్నూ, రావు కౌంటర్ స్విచ్ నొక్కాడు. ఎక్కడి లైట్లక్కడ నిల్చిపోయాయి మూర్తి నెంబరు చూసాడు.

"రెండువందల అరవై నాలుగు......ఊ......" గ్రాఫుపేపరులో కర్వ్సులోపలా, ఇపుడు రావు చూపించిందీ ఒకటే అయాయి. ప్రొఫెసర్ మూర్తి గంభీరంగా పోయి కుర్చీలో కూర్చున్నాడు. రావు దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

"మరి మనం రేపు బయలుదేరాలి......" అన్నాడు ప్రొఫెసర్ మూర్తి సంచీ మూసేస్తూ.

"సారీ సార్.....నాకు....వీలవదేమోనని భయంగా వుంది."

మూర్తి తలెత్తి చూచాడు. అదే ముఖ వైఖరి. ముడిపడ్డ కనుబొమలు......కొద్దిగా తెగిన జుత్తు.

"ఏం? కన్వెన్షన్స్ రాలేదా నీకు......"

"నే నసలు అప్లయి చెయ్యలేదండీ......"

"ఎందుకని? నేను చెప్తాననుకుంటాను మూడో తేదీకి సైన్స్ కాంగ్రెస్‌కు పోతున్నామని......లేకపోతే ఈ పేపర్లూ, గ్రాఫులూ తొందరేమొచ్చింది?"

రావు మాట్లాడలేదు. మూర్తికి కొంచెం కోపం వచ్చింది. పోయినసారీ ఇలాగే. అందరూ కలిసి టాండ్వాఫాల్స్ పోదామని పిక్నిక్‌వేస్తే తను రానన్నాడు. ఎవరో చెప్పారు; వ్యక్తిగతమైన కారణా లన్నాడని.......

"ప్రత్యేకమయిన కారణమేమన్నా ఉందా?" అని అడిగాడు మూర్తి.

"లేదండి......" వినయంగా జవాబిచ్చాడు రావు.

మూర్తి గ్రహించాడు.

"డబ్బు కావాలంటే......"

"థాంక్స్ సర్......అదికాదు......"

మూర్తి రావువేపు చూచాడు. ఆమెరిసేముఖంలో ఎంత ఆత్మాభిమానం! మూర్తి నవ్వుకున్నాడు.

"ఆల్‌రైట్......నేను ఎనిమిదోతేదీ వస్తాను. ఈలోగా ఆ ఎక్స్ఛేంజి చూడు......"

"సరే సార్......"

ప్రొఫెసర్ మూర్తి బయటికి నడిచాడు. రావు కౌంటర్‌దగ్గరకు పోయాడు.

మెట్లు దిగసాగాడు ప్రొఫెసర్ మూర్తి.

"మిస్టర్ రావ్......"

"సర్......" రావు మెట్లు దిగివచ్చి నిల్చున్నాడు.

"నీవు ఈవారం సెలవు కావాలంటే తీసుకో..... మీ వూరికిపోవచ్చు......నేను కూడా రెండురోజులు తర్వాతే వస్తానేమో?"

"ఈ వారమంతా సల్ఫర్—35 తో సరిపోతుందేమో......"

"నీ ఇష్టం....బై....."

"గుడ్‌నైట్ సర్......" రావు లోపలికి పోయాడు. కారు నెమ్మదిగా కెమిస్ట్రీ డిపార్టుమెంటునుంచి సైన్సు కాలేజీ దాటింది.

మూర్తి ఆలోచించసాగాడు. నాలుగోతేదీన సైన్సు కాంగ్రెస్‌లో పేపరు చదవాలి. ఒకటి రావు చదువుతే బాగుండేది......చిత్రమైనవాడు. అంత చిన్నవయసులో అంత నిగ్రహం.....అంత పట్టుదల......రావు మొదటిసారి వచ్చి తన్ను డాక్టరేట్ కోసం గైడ్‌గా అడిగినప్పుడు తను ఎందుకో ఒప్పు

# వానకురిసింది

కున్నాడు.....అతన్ని చూడగానే ఏమిటో జ్ఞాపకం వచ్చిం దానాడు.

మూర్తి గాఢంగా నిట్టూర్చాడు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.....కటక్‌లో పనికాగానే విజయనగరం పోవాలి ...... సుందరం ఎంతో సంతోషిస్తాడు.....తను తెలీకుండా వాడిదగ్గరికి పోతే ..... ఎగిరి గంతేయడూ వాడు......మూర్తి ఆనందంతో నవ్వుకున్నాడు......ఎక్కడి సుందరం.....నాలుగో క్లాసునుంచీ క్లాస్‌మేట్.....వా డిప్పుడు జిల్లా బోర్డు టీచరు......సెకండరీగ్రేడ్.....తను..... రీడర్.....ఎం.ఎస్సీ; డాక్టరేట్ రేడియో—ఆక్టివ్, ఐసోటోప్స్ విడదీయటంలో......ప్రస్తుతం 'కాశీ'లో రీడర్......ప్రొఫెసర్ మూర్తి.....డాక్టర్ ఎ. ఆనంద మూర్తి, ఎం.ఎస్సీ., పి.హెచ్‌డీ., ఎస్సీ.డి (పారిస్)

---

సాక్షి చెబుతున్న అబద్ధాలు విని విసిగిపోయిన జడ్జీ అతణ్ణి మందలించాడు.

"అయ్యా! నేను పుట్టినప్పటి నుండి సత్యానికే కట్టుబడి ఉన్నాను." సాక్షి తనను తాను సమర్థించుకుంటూ విన్నవించుకున్నాడు.

జడ్జీ చిరునవ్వు నవ్వుతూ "బహుశా ఇప్పుడు విడకులు ఇచ్చివుంటావు!" అని చలోక్తి విసిరాడు.

బి. వి. సోమయ్య (సత్తెనపల్లి)

---

మూర్తి ఇంటిదగ్గర కారువేగం తగ్గించాడు. కారు కాంపౌండ్‌లో నిలిపి, లైటువేసి, తలుపు తీశాడు. ఉహూ.....జాబులేమీ ఇంటికి కూడా రాలేదు......

ఒక్కక్షణం ప్రపంచంలో ఏకాకి అయిపోయి నట్లు భావించాడు మూర్తి.....ఈకారూ, ఈ ఖ్యాతీ, ఉద్యోగం.......ఈ జీతం ..... ఇన్నిటిమధ్యా అసంతృప్తి ...... ఏదో ఎక్కడో తప్పుచేశామన్న ఆవేదన......తెలియని బాధ......ఆరోజు తాను నిజంగా అంత పిచ్చిగా వుండకపోతే? ఎం. ఎస్సీతో ఆపి అలాగే బ్రతికివుంటే? ఈ కారూ, హోదా, రూపాయలూ వుండేవికావు......కాని.....

నెలకు రెండువందల ముప్ఫైఅయిదు రూపాయల జీతం, వారానికి ఇరవయినాలుగు గంటల పనీ, స్టూడెంట్సూ వుండేవాళ్ళు......పి. యు. సీకి సల్ఫ్యూరిక్ ఆసిడూ, బి. యస్సీ కి రేడియో ధార్మికతా చెప్పేవాడు .... చాలీచాలని జీతం...... అప్పులు.......పేరూ ఊరూ లేని ఉద్యోగం....

కానీ సుశీల వుండేది ప్రక్కగా.....పున్నమి వెన్నెల్లాంటి సుశీల ...... అమావాస్యరేయి తారల వెలుగులాగా ....... తనప్రక్కనే, తనవద్దనే......

తా నా రోజు తప్పుచేశాడా?......

*            *            *

"మావాళ్ళు ఆగరు ఆనంద్! నిజం చెప్తున్నాను" అంది సుశీల ఆరోజు. ఆ కంఠంలో ఆవేదనా, ఆరాధనా తనకు ఎందుకు అర్థంకాలే దారోజు?

"అదికాదు సుశీ......నామాట విను.....ఈ ఉద్యోగం గొర్రెతోకలాంటిది......నీకూ నాకూ సరిపోతుంది......కానీ......తరువాత? జీవితంలో అన్ని సౌఖ్యాలూ అనుభవించవద్దా మనం......కనీసం మన.. మన పిల్లలు? నా ఫ్రెండ్ రాశాడు.....చూడు..... సరిగ్గా నాలుగేండ్లు......డాక్టరేట్ రాగానే వచ్చేస్తాను......తర్వాత......"

"అంతదాకా నేను వుండలేను ఆనంద్!"

అంతకన్నా ఏమీ అనలేదు సుశీల. తన కారోజు డాక్టరేట్—ఫ్రాన్సులో జీవితం—హోదా ఇవే కన్పించాయి......తమ ఇద్దరిసంగతి సుశీల తల్లిదండ్రులకు తెలీదనీ, సుశీల పెండ్లికి వాళ్ళు చాలా ప్రయత్నాలు చేస్తున్నారనీ తనకు విన్పించలేదు కన్పించలేదు.

"పోనీ మా అన్నయ్యను నీకు తెలుసుగా, అడుగు"

"ఏమని అడుగను సుశీ? నేను నాలుగేండ్లలో వస్తాను. ఈ అవకాశం పోతే రాదు.....నీవు నా కోసం కాచుకొనివుండాలి....నాకోసం, నీకోసం, మనిద్దరికోసం......"

"నీ కర్థంకాదు ఆనంద్! నీవు పోయిన క్షణం నేను ఏకాకి అయిపోతాను.....నాకు ధైర్యంలేదు.... తర్వాత విచారించి లాభంలేదు......"

"ఎందుకని నిస్పృహ ఇప్పట్నుంచి......"

ఆరోజు సుశీలహృదయంలో రేగే తుఫానును తన హృదయంలోని బెరామీటర్ కనుక్కోలేకపోయింది......తను అబలననీ, తను తల్లిదండ్రుల మాటకొరకు ఎవర్నయినా వివాహమాడాల్సి వస్తుందనీ సుశీల అన్నమాటల్ను తనానాడు లెక్కచేయలేదు.

తను ఫ్రాన్సుకుపోవడం .... సుశీలవివాహం జరగడం జరిగాయి.....ఎఫిల్‌టవర్ నీడలో, లాబరేటరీలో కౌంటర్లమధ్యా ఆనందమూర్తి యాంత్రికంగా డాక్టరేట్‌కు పని చేశాడు.......డాక్టరేట్ వచ్చింది......

అదంతాఇరవయ్యేళ్ళనాడు.....తను ఇంకా పెండ్లి చేసుకోలేదు.....మళ్ళీ మరో సుశీల ఎలావస్తుంది?

మూర్తి గదిలో నీలందీపం స్విచ్‌వేసి పడుకున్నాడు......

కిటికీలోంచి వెన్నెల ఆనందమూర్తి మంచం మీద పాలుపొంగినట్లు వెలిగింది....

బాధగా, నిస్త్రాణగా, ఏదీ తెలియని వ్యథతో కండ్లు మూసి నిద్రకోసం ప్రయత్నించాడు ప్రొఫెసర్ మూర్తి, ఎం.ఎస్సీ., పి. హెచ్ డి., ఎస్. సీ. డీ. (పారిస్)......

*            *            *

కటక్‌లో సైన్సు కాంగ్రెస్ అయిపోయింది. నాలుగోతేదీన రెండువందలమంది ప్రతినిధుల ముందు ఒక "పేపరూ," అయిదోతేదీ మరో పేపరూచదివాడు. మూర్తి. చాలామంది బాగుందని మెచ్చుకున్నారు.

ఏడోతేదీని మెయిల్లో విజయనగరం బయలుదేరాడు. పక్కపల్లెలో సుందరం టీచర్. చిన్ననాటి సహపాటి. మిత్రుడు.

అయిదేండ్లతర్వాత వాడ్ని చూడడం తటస్థిస్తోంది. వాడికి తనేం తీసుకుపోటంలేదు...... ఇల్లు కనుక్కోడం ఎలాగో! అనుకున్నాడు. రిక్షా నుంచి దిగి బయలుదేరాడు.....మరో అరమైలు వుంటుంది కాబోలు. దూరంగా కొన్ని ఇండ్లగుపించాయి.

ఈ పల్లె కొంపలోవున్న బోర్డు పాఠశాలలో సుందరం టీచరు.....నెలకు అరవైయ్యో...ఎనభై కాబోలిప్పుడు.....

చేతిలోసంచి బరువుగా వుంది. అంతా క్లోక్ రూంలో వుంచేశాడు కాబట్టి సరిపోయింది.

"వానవచ్చేట్టుంది" అనుకున్నాడు మూర్తి..... 'మరో అరమైలు వుంటుందా......' అనుకుంటూ త్వరత్వరగా నడువసాగాడు.....

వాన మొదలయింది. చుట్టూతా చూచాడు. ఓ మర్రిచెట్టు కన్పించింది కల్పవృక్షంలాగా .... క్రింద చేరుకున్నాడు.......వాన, జడివాన అయింది...

"ఎంతదాకా వెడుతున్నారు?"

ఉలికిపడ్డాడు మూర్తి ప్రశ్నవిని.

సిగరెట్ త్రాగుతూ ఆరడుగుల ఎత్తున నిల్చుని చేతిలో ఒక పుస్తకంతో సాక్షాత్కరించాడు ఎవరో......

"సుందరం......మా స్నేహితుడిక్కడ టీచర్.."

"ఎవరన్నారూ.....సుందరమా......ఇంటిపేరు?"

చెప్పాడు మూర్తి.....

"మీరు ఎక్కణ్ణుంచి వస్తున్నారు......?"

అదీ చెప్పాడు.

"పాపం. వృధాశ్రమ...సుందరంగారు మరో ఊరికి ట్రాన్ఫరయి మొన్నసోమవారం వెళ్ళిపోయారు......నేనే అతని ప్లేస్‌లో వచ్చాను...."

ఇద్దరూ పరస్పరం పరిచయంచేసుకున్నారు ....

"మీ కభ్యంతరం లేకపోతే మీరు రాత్రికి మా ఇంట్లో వుండి పొద్దున్నే పోవచ్చు......"

మూర్తి నసిగాడు......వాన తగ్గింది......

"పదండి......అదే మా ఇల్లు"

మూర్తి అతన్ననుసరించాడు.

"ఇదే మా ఇల్లు......తోట బాగుందంటారా.... మా ఆవిడ స్పెషాలిటీ ...... రోజాలు...ఇది నా స్పెషల్‌లెండి.....గోంగూర......

మూర్తి నవ్వాడు......అతనూ కలిపాడు....

"కూర్చోండి......" కుర్చీ చూపించాడు అతను. మూర్తి కూర్చున్నాడు. చుట్టూతా ఫోటోలూ, కాలెండర్లూ వున్నాయి.

"మరి సైన్స్ కాంగ్రెస్ అయిపోయిందా? మీ రేవయినా......"

"ఏదో—రెండు పేపర్లు చదివాను...."

మూర్తి మనస్సులో కొంత నిరాశగానేవుంది. ఇన్నిరోజుల తర్వాత తమ రావడం—సుందరం లేకపోవటం.

"మీరు కాశీలోకదూ అన్నారూ.....పని చేసేది. నాకు మీ సబ్జెక్ట్సు తెలీదనుకోండి ..... మీకు రామారావు తెలుసా?"

"ఎవరు? ఏ క్లాసు?"

"ఎం. ఎస్‌సీ అయిపోయింది....డాక్టరేట్‌లో చేరాడు......"

"అరే! రామారావు......నా స్టూడెంట్ ఒకతను రామారావు ..... తెలుగువాడే ..... సన్నగా ఎర్రగా వుంటాడు ...... ఇంటిపేరు 'పి' కదూ.....?" అన్నాడు ఆశ్చర్యంగా మూర్తి.

"అయితే అతనే......మీకు - ఆశ్చర్యం కలుగుతుందేమో......అతను నా కుమారుడు......"

మూర్తి నోరు తెరిచేశాడు.

"అంతా వాళ్ళ తాతగారి చలవనుకోండి...... అంతా ఆయనే సహాయం చేశారు. వాడి చదువుకి"

"రావు — అలా పిలుస్తాం మేము....చాలా విచిత్రమయిన మనిషి ...... అంత చిన్నవయసులో అంత పట్టుదలా, తెలివీ వున్నవాడు కన్పించలేదు నాకు. అటువంటి విద్యార్థి దొరకడం కష్టమే"

అతను సంతోషంగా తల వంచుకున్నాడు.

"మీ రన్నారు కనుక చెపుతున్నాను. తండ్రిగా నేను వాడ్ని చాలా దగ్గిర తీయలేదు.....అంతా వాళ్ళ తాతగారింట్లోనే పెరిగాడు. వాడి పోలికలన్నీ నా భార్యవి......అదొహ తరహా మనిషి ఆమె......నేను మొదటిరోజుల్లో బియ్యేకి కట్టుదామనీ, ఎం. ఏ. చేద్దామనీ అనేవాడిని. తను అనేది : "డిగ్రీలుండగానే సరికాదు' అని. నాకు నిజం అనిపిస్తూంది: నేను ఇక్కడ మొత్తం ఎనభయి రూపాయిలు సంపాయిస్తాను ...... పొలంగింజ లున్నాయనుకోండి.... పైన ట్యూషన్లుంటాయి.....అదికాక — కొంచం రాత మూలకంగా వస్తుంది"

"మీరు రచయితలా......?"

"ఓవిధంగా ..... అప్పుడప్పుడూ రాస్తుంటాను. ఇదీ మా ఆవిడ చలవే. చాలారోజులక్రింం దోసారి ఏదోరాసి ఆమెకు వినిపించాను. ఆమె సలహా ప్రకారం పత్రికలకు పంపాను—అచ్చయింది.....అదే మొదలు"

"మీరు నిజంగా అదృష్టవంతులు....."

"ఇప్పుడే వస్తాను......" అని లోనికెళ్ళా డతను.

మూర్తి గోడలకేసి చూస్తూ కూర్చున్నాడు. ఒకవేపు ఫోటో కన్పించింది......

మూర్తిహృదయం విపరీతంగా కొట్టుకుంది. మరింత జాగ్రత్తగా చూచాడు.....వీళ్లేదు.....అలా జరగటానికి వీల్లేదు......ఏమిటీ సంఘటన......?

"ఫోటోలు చూస్తున్నారా? అది నేనూ, నా భార్యా తీసుకున్నది.....ఇదొక్కటే ప్రస్తుతం...... అరె—ఒంట్లో బాగోలేదా?"

"అప్పుడప్పుడూ వస్తూంటుందిలెండి. ఫర్వాలేదు" అనగలిగాడు ప్రొఫెసర్ మూర్తి కళ్ళు మూసుకుని. కుర్చీలో వెనక్కి జారగిలబడ్డాడు భారంగా.

ఇరవయ్యేళ్ళ గతం ఒక్కసారిగా కట్టకట్టుకుని తనమీదుగా పిడుగులాగు పడింది......తనెనాడూ తలచుకోలేనిసంఘటన మెరపులాగాతటస్థించిం దీరోజు.

ఎక్కడి సుశీల......ఎక్కడి రామారావు! పారిస్... కాశీ......విజయనగరం.....టీచర్ భార్య......రీడర్...

"ఎలావుంది?" ఆదుర్దాగా అడిగా డాయన.

"తగ్గింది" అతను సంతృప్తిగా నిట్టూర్చాడు.

"చూడండి....మీ రేమీ అనుకోకపోతే నేను వెళ్ళాలి. వేరే పనుంది......జ్ఞాపకం వచ్చింది..."

"అంత తొందరేమిటండీ! మీరు మా కిప్పుడు దూరపుచుట్టాలు కాదు.....రామం గురువుగారు.... మా ఆతిధ్యం స్వీకరించాల్సిందే!" అన్నా డాయన.

అవును. బంధుత్వం గురించి అతనికేం తెలుసు? రాత్రి భోజనా లయిపోయాయి. సుశీల కన్పించలేదు. మూర్తికి. 'కాశీలో ఇలాగే భోంచేస్తారా' అని అతను టేబిల్‌మీద భోజనాలు వేరుగాపెట్టాడు.



**PAKCO** ప్యాక్కో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—



* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును.
* బాష్ ఫ్యూయెల్ ఇంజక్షన్ పరికరములు

మద్రాసు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :

Grams : LAMP **K. S. SHIVJI & CO.** (Estd. 1903)
Phone : 22017 పోస్టుబాక్సు నెం. 6, 178-79 బ్రాడ్వే, మద్రాసు-

తెల్లని
దంతములు
ఆరోగ్యకరమైన
చిగుళ్లు
శుభ్రమైన
నోటివాసన






Remy

**TOOTH PASTE**
**(WITH AZULENE)**

రెమి టూత్ పేస్టు

రెమి టూత్ పేస్టు వాడుటకు మొదలు పెట్టండి. దానికి చక్కని వాసన గలదు. ఉపయోగించిన తర్వాత చాలా సేపు నోటి వంటి పెట్టుకొని యుండును. రెమి పండ్ల పొడి కూడా లభించును.

రెమి ప్రొడక్ట్స్, ఇండియాలో తయారు

| మలయాలో లభించు ప్రదేశము : | సిలోనులో లభించు ప్రదేశము : |
| --- | --- |
| మెసర్సు మీనా ట్రేడింగ కంపెనీ, 60-ఎ, మార్కెట్ రోడ్, సింగపూరు-1. | ఎ. వి. ఆర్. ఎ. లిమిటెడ్, కొలంబో. |

రెమి హాస్యనాటకం ప్రతి శుక్రవారం రేడియో సిలోను 41.72 మీటర్ల మీద సా॥ 6–30 నుండి 6–45 గంటలవరకు వినండి. RP931

# వాన కురిసింది

"మీ రూ గదిలో పడుకోవచ్చు......రామం వస్తే అది వాడికోసం వుంచాను......సెలవుల్లో వస్తాడు కాబోలు......మీకు ధోవతిస్తాను.....కట్టుకోండి.."

రాత్రంతా నిద్రపట్టలేదు మూర్తికి. ఏమిటీ విచిత్రం! ఇరవయ్యేళ్ళనాటి బంధం ఈరోజు విడిపోవాలా? తనేం చేయగలడు?

"సుశీల కన్పిస్తే చూడాలి, ఎలావుందో?" అనుకున్నాడు. అతనికి వెంటనే జ్ఞాపకం వచ్చింది రామారావు సంగతి. బహుశా ఈ వేళకు కౌంటర్ దగ్గర కూర్చుని సగం మూసుకుపోతున్న కండ్లతో 'కౌంట్స్' లెక్కిస్తూంటాడు. అదే సీరియస్‌నెస్, అవే కండ్లు, నడక.....జుత్తు.....సుశీల కొడుకుకదూ!

"ఇన్నిరోజులూ ఎలా జ్ఞప్తికి రాలేదు నీవు?" అని ప్రశ్నించాడు తనకు అగుపడని సుశీలను..... సుశీల—ప్రస్తుతం తనకు ఆతిథ్యం ఇస్తూంది.....

మర్నాడు పొద్దున్నే అతను మూర్తిని లేపాడు. మొదటి బస్సులో విజయనగరం చేరుకున్నాడు మూర్తి. వేకువజామున చీకట్లో సుశీల కనుపించలేదు......క్రీనీడల్లో 'రామం తల్లి' కన్పించింది ....దిగులుగా వెళ్ళాడు మూర్తి.

కాశీ చేరుకున్నాడు మూర్తి. ఆరోజు సాయంత్రం లాబొరేటరీకి వచ్చాడు. అతని మనస్సులో సుడిగాలి రేగుతూవుంది.

"గుడీవెనింగ్ సర్" రావు ఎదురువచ్చాడు. ఒక్కక్షణం పాటు మ్రాన్పడి నిలబడిపోయాడు మూర్తి. తమాయించుకుని గదిలోకి నడిచాడు.

కాస్సేపటికి రావు వచ్చాడు. గ్రాఫులూ, కాగితాలు తీసుకువచ్చి టేబిల్‌మీద వుంచాడు.

"ఎక్స్చేంజ్ అరవయి డిగ్రీలలోపల రాలేదండీ......దాదాపు రెండు గంటలకు కూడా రియాక్షన్ జరుగలేదు.....అరవయిపైన...."

రామారావు......రామం.....సుశీల కొడుకు..... తను భాగస్వామిగా ఎంచుకున్న, ప్రేమించిన సుశీల కొడుకు—కాని తన కొడుకు మాత్రంకాడు..... శిష్యుడు.....మూర్తి తలెత్తాడు......రామారావు ఆగాడు.

"మొన్న మీ ఇంటికి వెళ్ళాను.....అనుకోకుండా... విజయనగరందగ్గర మా మిత్రుడికోసం పోయాను... అతనులేడు. రాత్రికి మీ నాన్నగారే ఆతిథ్యం ఇచ్చారు.." రామారావు కళ్ళు పెద్దవయాయి—అవే పోలికలు—తిరుగులేదు. సుశీల ప్రతిరూపం.

రామారావు తలవంచుకుని వింటున్నాడు. పార్కులో సాయంత్రం చీకటి పడినప్పుడు సుశీల అలాగే నిల్చునేది......మనస్సు రేగిపోతూంది.

"రాత్రి అక్కడేవుండి, పొద్దున్నే వచ్చాను. మీ నాన్నగారు బాగున్నారు. మీ అమ్మగారిని....." మూర్తికంఠం వణికింది. రామారావు ఉలిక్కిపడి తలెత్తి చూచాడు. ఆశ్చర్యం ప్రతిఫలించింది ఆ కండ్లలో. ఏమయిందన్నట్లు చూచాడు ప్రొఫెసర్ మూర్తి. రామారావు తల వంచుకున్నాడు. తర్వాత అస్పష్టంగా "మా అమ్మ చనిపోయి పదిహేనేళ్ళయిందండి" అన్నాడు.

రామారావు చెంపలమీదా, మూర్తి హృదయంలోనూ వాన కురిసింది. ★